epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 61 | మంగళవారం | 02.07.2024



(ఫైల్)



## గ్రీవెన్స్ సాక్షిగా

# అఘాయిత్యాలు

### మొన్న నర్సింగరావు.. నేడు జ్యోతి

ప్రజావాణికి తిరిగి విసిగి వేసారుతున్న జనాలు

సమస్య పరిష్కరం కావడం లేదనే ఆత్మహత్యాయత్నాలు

వివాదాల కేంద్రంగా జనగామ కలెక్టరేట్

2 లో..

### ఆత్మహత్య.. సమస్యకు పరిష్కారం కాదు

- హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ

2 లో..

## దరఖాస్తుదారునికి సరైన సమాచారం ఇవ్వాలి

- కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారునికి సరైన సమాచారం ఇవ్వాలని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. సోమవారం గ్రీవెన్స్ డే అనంతరం నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రీవెన్స్ కు వచ్చే దరఖాస్తుదారులకు మండల స్థాయిలోనే అధికారులు సరైన సమాచారం ఇవ్వాలని, సమస్య పరిష్కారం కోసం సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అన్ని తీసుకొచ్చే విధంగా అవగాహన పరచాలన్నారు. కోర్టు కేసుల పరిష్కారంలో జాప్యం తగదని హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలన్నారు. 90 శాతం దరఖాస్తులు భూ సంబంధిత సమస్యలపైనే వస్తున్నట్లు తెలియజేశారు. సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్ సింగ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న, జడ్పీ సీఈవో అనిల్ కుమార్ డీఆర్డీఏ పీడీ మొగులప్ప, జిల్లా అధికారులు పాల్గొన్నారు.






5 లో

### బాధితులకు బాసటగా నిలవాలి




### జనగామ కాంగ్రెస్‌లో ‘కారు’ చిచ్చు

- మాజీ మున్సిపల్ చైర్మన్ వాహనానికి నిప్పు పెట్టిన గుర్తుతెలియని దుండగలు
- కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో నాకు ప్రాణహాని..
- ఎర్రమల్ల సుధాకర్ ఆరోపణ.. పీఎస్‌లో ఫిర్యాదు
- కౌంటర్ అటాక్ ఇచ్చిన కొమ్మూరి వర్గీయులు

3 లో

General News

# గ్రీవెన్స్ సాక్షిగా అఘాయిత్యాలు

## మొన్న నర్సింగరావు.. నేడు జ్యోతి

- ప్రజావాణికి తిరిగి విసిగి వేసారుతున్న జనాలు
- సమస్య పరిష్కరం కావడం లేదనే ఆత్మహత్యాయత్నాలు
- వివాదాల కేంద్రంగా జనగామ కలెక్టరేట్

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :** జనగామ కలెక్టరేట్ వివాదాలకు కేంద్రంగా మారుతోంది. సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం అధికారులకు కొత్త సమస్యలను తెచ్చిపెడుతోంది. వివిధ సమస్యలపై కలెక్టరేట్ వస్తున్న జనం నెలలు, సంవత్సరాల తరబడి తిరిగి విసిగివేసారి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. గత వారం జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి చెందిన నిమ్మల నర్సింగరావు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. తాజాగా ఈ వారం నర్మెట మండలానికి చెందిన దేవులపల్లి జ్యోతి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. వరుస ఘటనలతో అసలు జనగామ కలెక్టరేట్ లో ఏం జరుగుతుంది..? సమస్యలపై వచ్చిన ప్రజలకు పరిష్కారం ఎందుకు లభించడం లేదు..? అధికారులు అసలు పనిచేస్తున్నారా..? అనే ప్రశ్నలు తలెత్తున్నాయి.



### అసలేం జరిగింది..

జనగామ జిల్లా నర్మెట మండలానికి చెందిన దేవులపల్లి జ్యోతికి తన తండ్రి దేవులపల్లి శ్రీహరి ఎకరం 4 గుంటలు భూమి పట్టా చేశాడు. అయితే ఆ భూమిని నర్మెట కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు జంగెటి అంజయ్య తాను కొనుగోలు చేసాశానని స్వాధీనం చేసుకొని కబ్జాలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న జ్యోతి ఆ భూమిలోకి వెళ్లి అంజయ్యను అడుగగా.. తాను కొనుగోలు చేసానని, ఏం చేసుకుంటావో చేసుకోపో అంటూ బెదిరిస్తున్నాడని ఆమె పేర్కొంది. ఈ క్రమంలో సోమవారం కలెక్టరేట్ వద్దకు వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విధుల్లో ఉన్న పోలీసులు వెంటనే ఆమెను రక్షించి జిల్లా హాస్పిటల్‌కు తరలించారు. అయితే సదరు బాధితురాలు సమస్యపై గతంలో స్థానిక పీఎస్‌కు వెళ్లినట్టు తెలుస్తోంది. అక్కడ సివిల్ కేసు కావడంతో కోర్టుకు వెళ్లాలని చెప్పినట్టు సమాచారం. ఇదిలా ఉండగా జ్యోతి గతంలో ఎప్పుడు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయలేదని, సమస్యను తమకు వివరించడకుండా ఇలా అఘాయిత్యానికి పాల్పడిందని కలెక్టరేట్ అధికారులు తెలిపారు. మరోవైపు నర్మెట గ్రామ శివారులోని 201/బీ/1 సర్వే నంబర్‌లో జ్యోతికి ఉన్న 22 గుంటల భూమికి పట్టాదారు పాస్‌బుక్ ఇది వరకే జారీ చేశారని అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై కోర్టులో కేసు కూడా ఉందని తెలిపారు. ఈ సమస్య రెవెన్యూ శాఖ పరిధిలో లేకున్నా బాధితురాలు జ్యోతి అధికారులను తప్పుదోవ పట్టించడం సరికాదని అందులో పేర్కొన్నారు.

### డబ్బులు డిమాండ్ చేశారు

**నేను 2006లో 2 ఎకరాలు భూమిని ఎకరానికి రూ.28 వేల చొప్పున కొనుగోలు చేశాను. ఇందుకు సంబంధించిన డబ్బులు పూర్తిగా ఎప్పుడో చెల్లించాను. కానీ జ్యోతి మళ్లీ డబ్బులు డిమాండ్ చేసింది. పోలీస్ స్టేషన్ కూడా వెళ్లింది. అక్కడ ఆమెకు నిరాశే ఎదురుకావడంతో నన్ను రోడ్డుపైకి లాగేందుకు ఇలా ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయంపై నేను తహసీల్దార్‌కు అన్ని డాక్యుమెంట్లు అందజేశాను. జ్యోతి పెద్దనాన్న కూడా వచ్చి ఆ భూమి తామే అమ్మినట్టు వాగ్మూలం ఇచ్చారు.**

*- జంగెటి అంజయ్య,* కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, నర్మెట

### నర్సింగరావుది అదే తంతు..




జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి చెందిన నిమ్మల నర్సింగరావు వ్యవసాయ కూలీ. ఈయనకు తాతల నుంచి వారసత్వంగా 7.29 ఎకరాల భూమి వచ్చింది. నర్సింగరావు కొన్నేళ్ల కింద బతుకు దెరువు కోసం ములుగు జిల్లాకు వెళ్లాడు. ఇదే అదనుగా భావించిన దాయాదులు ఈయనకు చెందిన భూమిని 2009లో కొంత, 2016లో మరికింత వారి పేరుపై అక్రమంగా పట్టా చేయించుకున్నారు. తన భూమిని తనకు ఇప్పించాలని నర్సింగరావు 2017 నుంచి కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నాడు. గతంలో ఒకసారి కలెక్టర్ భవనం ఎక్కి పెట్రోల్ పోసుకున్నాడు. తాజాగా గత సోమవారం జనగామ కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణికి వచ్చి, కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వకుండానే కలెక్టరేట్ భవనం పైకి ఎక్కి న్యాయం చేయాలంటూ బ్యానర్ కట్టాడు. అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్ అక్కడికి చేరుకుని సమస్య పరి ష్కరిస్తామని హామీ ఇచ్చినా అప్పటికే నర్సింగరావు పురుగుల మందు తాగాడు. కాగా నర్సింగరావుకు వారసత్వంగా భూమి ఉన్నట్లు ఎలాంటి రికార్డులు లేవని, ఈ అంశం కోర్టు పరిధిలో ఉన్నదని అధికారులు చెబుతున్నారు. అయితే 2017 నుంచి ఆయన కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు సీరియస్ తీసుకోకుండా ఎందుకు తత్సారం చేశారు..? కోర్టు పరిధిలో ఉన్న సమస్యపై ఇన్ని రోజులు ఎందుకు అర్జీలు తీసుకున్నారు..? అని బాధితుడు ప్రశ్నిస్తున్నాడు.

### ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు



**మనుషుల్లో ఈ మధ్య ఓపిక, సహనం నశించి పోతున్నాయి. ఏ సమస్యకైనా ఓ పరిష్కారం ఉంటుంది. ఆ దిశగా వెళ్లి పరిష్కరించుకోవాలి కానీ ఆత్మహత్య పరిష్కారం కాదు. ఇటీవల కాలంగా భూముల ధరలకు రెక్కలు రావడంతో భూ సమస్యలు ఎక్కువ అవుతున్నాయి. వీటి పరిష్కారం కోసం మండల స్థాయిలో తహసీల్దార్ సుప్రీమ్. అయితే అక్కడ పరిష్కారం కాని పక్షంలో వారు జిల్లా కేంద్రానికి పంపిస్తే బాగుటుంది. కానీ జిల్లాలో చాలా మండలాల్లో ఇది జరుగడం లేదు. దీంతో బాధితులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వస్తున్నారు. ఇక్కడికి వచ్చాక మళ్లీ ఆ సమస్యను ఉన్నతాధికారులు ఆర్డీవో లేదా తహసీల్దార్ రెఫర్ చేయడం పరిపాటిగా మారింది. అలా తిరిగి విసిగి వేసారుతున్న జనం ఎలాగైనా తమ సమస్య నలుగురికి తెలియాలి. మీడియాలో చర్చ సాగాలి. అప్పడే పరిష్కారం లభిస్తుంది. అనే ఆశతో అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. అధికారులు సైతం సమస్యలతో వచ్చిన వారికి సరైన న్యాయం చేసేందుకు కృషి చేయాలి. అవసరం అనుకుంటే ఒక ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి బాధితులకు కౌన్సిలింగ్ ఇచ్చి న్యాయం చేయాలి.**

*– సాదిక్ అలీ,* సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్ట్ న్యాయవాది



## బతుకమ్మకుంటలో ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించాలి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలోని బతుకమ్మ కుంటలో కళా, సాహిత్య, ప్రజాహిత కార్యక్రమాల నిర్వహణ కోసం ఓపెన్ ఎయిర్ థియేటర్ నిర్మించాలని కవులు, కళాకారులు కోరారు. ఈ మేరకు ఐక్య వేదిక అధ్వర్యంలో సోమవారం జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌కు వినతిపత్రం అందజేశారు. జనగామ జిల్లా అనేక రకాల కళలకు సాహిత్యానికి ప్రసిద్ధి చెందిందని, ఇక్కడ కళావేదిక నిర్మాణం ఎంతో అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయమై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు కవులు, కళాకారులు తెలిపారు. వినతిపత్రం సమర్పించినవారిలో కవులు కళాకారులు ఐక్యవేదిక నాయకులు జి.కృష్ణ, అయిలా సొమనర్సింహచారి, లగిశెట్టి ప్రభాకర్, మాన్యపు భుజేందర్, చీటూరు నర్సింహులు, ఆనంద్ కుమార్, కన్నారపు శివశంకర్, చిలుమోజు సాయికిరణ్, గుగ్గిల్ల నర్సయ్య, చిలుమోజు దక్షిణామూర్తి, పెట్లోజు సోమేశ్వరాచారి, డాక్టర్ వేముల సదానందం, పొట్టబత్తిని భాస్కర్, గడ్డం మనోజ్ కుమార్ గౌడ్, తాళ్లపల్లి లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు. కాగా, సోమవారం నిర్వహించిన గ్రీవెన్‌లో మొత్తంగా 92 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టరేట్ అధికారులు ప్రకటించారు.



# జనగామ కాంగ్రెస్‌లో కారు చిచ్చు


- మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల వాహనానికి నిప్పు పెట్టిన దుండగలు
- కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో నాకు ప్రాణహాని..
- ఎర్రమల్ల సుధాకర్ ఆరోపణ.. పీఎస్‌లో ఫిర్యాదు
- కౌంటర్ అటాక్ ఇచ్చిన కొమ్మూరి వర్గీయులు

**మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :**

జనగామ కాంగ్రెస్‌లో రాజకీయాలు భగ్గమంటున్నాయి. నిన్న మొన్నటి నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు ఒక్కసారిగా బయటపడింది. జనగామ మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్ వాహనాన్ని ఆదివారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. అయితే ఈ ఘటనపై సుధాకర్ స్పందిస్తూ జనగామలో ప్రస్తుతం తమ వర్గం ఒకటి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి వర్గం మరొకటి ఉందని, ఆయన వర్గీయులై తన వాహనాన్ని దహనం చేశారని ఆరోపించారు. ఈ మేరకు జనగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొమ్మూరితో తనకు ప్రాణ హాని ఉందని అందులో పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు సీనియర్ నాయకులు, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి మధ్య తగాదా రోజురోజుకూ ముదురుతోంది. ఈ క్రమంలో కొన్ని రోజుల కింద పార్టీకి చెందిన కొందరు లీడర్లు కొమ్మూరిపై హైకమాండ్ ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించిన లెటర్ కూడా అప్పట్లో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిని సీరియస్ తీసుకున్న కొమ్మూరి సదరు లీడర్లపై పార్టీ క్రమశిక్షణ కమిటీ ఫిర్యాదు చేశారు. ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేయించారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు ఎర్రమల్ల సుధాకర్, వేమళ్ల సత్యనారాయణరెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ ముస్త్యాల చందర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ అన్వర్, చేర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఉడుముల భాస్కర్‌రెడ్డి నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి, అభ్యర్థి ఓటమికి పని చేశారనే ఫిర్యాదుల వల్లే ఈ నోటీలు ఇచ్చినట్టు అందులో వివరించారు. నాటి నుంచి పార్టీలో వర్గపోరు బయట పడినట్టి అయ్యింది.

## ఘటనపై ఫిర్యాదు.. కొమ్మూరిపై కేసు నమోదా?

ఎర్రమల్ల సుధాకర్ తన ఇంటి వద్ద పార్క్ చేసి ఉన్న కారును దహనం చేయడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. కొమ్మూరి వర్గీయులై తన వహనాన్ని దహనం చేశారని, కొమ్మూరితో తనకు ప్రాణహాని ఉందని బహిరంగ ఆరోపణలు చేశారు. ఈ మేరకు జనగామ పీఎస్‌లో ఎర్రమల్ల సుధాకర్ ఫిర్యాదు కూడా చేశారు.





## కొమ్మూరి వర్గీయుల కౌంటర్

డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై ఆరోపణలు చేసి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్‌కు కొమ్మూరి వర్గీయులు కౌంటర్ ఇచ్చారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో పీసీసీ సభ్యుడు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, జనగామ మండల అధ్యక్షుడు లింగాల నర్సిరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వంగాలా కళ్యాణి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి తదితరులు ఎర్రమల్లపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఓటమికి ప్రత్యర్థులతో చేతులు కలిపి పార్టీకి ద్రోహం చేశారని, పార్టీ అధిష్టానం ఎన్నిసార్లు హెచ్చరించినా, ఎన్ని షోకాజ్ నోటీసులు జారీచేసినా, ఆయనలో మార్పు రాలేదంటూ మండిపడ్డారు. చివరకు సొంత వాహనాలనే దగ్ధం చేసుకునే దురదృష్ట స్థాయికి దిగజారారని ఆరోపించారు. సుధాకర్ తనకు తానే వర్గాలుగా అభివర్ణించుకుంటూ ఎమ్మెల్యే స్థాయి నాయకులడిని అనిపించుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఇకనైనా అవి మానుకోవాలని హితవు పలికారు. వాహనాన్ని దహనం చేసిన వ్యక్తుల పైన అనుమానం ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కానీ ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం వల్ల కార్యకర్తల్లో ఐక్యత కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో మేడ శ్రీనివాస్, సర్వల నరసింగరావు, సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ నిమ్మతి మహేందర్ రెడ్డి, జనగామ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్, బచ్చన్నపేట మండల అధ్యక్షుడు నూకల బాల్ రెడ్డి, నర్మెట మండల అధ్యక్షుడు రాజుపేట లక్ష్మీనారాయణ, తరిగొప్పుల మండల అధ్యక్షుడు యాదగిరి గౌడ్, బొట్ల నరసింగారావు తదిరులు పాల్గొన్నారు.



# వస్తున్నా..

## ఇండస్ట్రీలోకి నందమూరి మరో వారసుడు

**మన చౌరాస్తా, సినిమా :** నందమూరి అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్. ఈ ఇంటి నుంచి మరో వారసుడు సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టనున్నాడు. అతను మరెవరో కాదు నందమూరి నట సింహం బాలకృష్ణ వారసుడు నందమూరి మోక్షజ్ఞ. ఎప్పటి నుంచో బాలయ్య కుమారుడు సినిమాల్లోకి వస్తున్నాడని ప్రచారం జరుగుతోంది. నందమూరి అభిమానులు కూడా మోక్షజ్ఞ ఎంట్రీ కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఇప్పడీ నిరీక్షణకు తెర పడనుంది. మోక్షజ్ఞ ఎంట్రీకీ రంగం సిద్ధమైందని తెలుస్తోంది. డెబ్యూ మూవీ గురించి ఇంకా క్లియర్ అప్ డేట్ రాలేదు కానీ మోక్షజ్ఞకు సంబంధించిన కొన్ని కొత్త ఫొటోలు ఇప్పడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గతంలో కొంచెం బొద్దుగా ఉన్న అతను ఇప్పడు ఎంతో నాజుకుగా, స్టైలిష్ గా మారిపోయాడు. ఇలా స్లిమ్ గా, హ్యాండ్సమ్ గా ఉన్న ఫొటోలను ట్విట్టర్ లో షేర్ చేసిన మోక్షజ్ఞ 'వస్తున్నా.. మీ అందరి ఆశీస్సులు కావాలి' అని రాసుకొచ్చాడు. ప్రస్తుతం మోక్షజ్ఞ ఫొటోలు, ట్వీట్ నెట్టింట వైరలవుతున్నాయి. వీటిని చూసిన అభిమానులు తెగ సంబర పడిపోతున్నారు. బాలయ్య కుమారుడి ఎంట్రీ ఖాయమైందంటూ నెట్టింట కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. త్వరలోనే మోక్షజ్ఞ సినిమా అరంగేట్రం ఉంటుందని గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చెప్పకొచ్చారు బాలయ్య. అందుకు తగ్గట్టుగానే ఇప్పడు మోక్షజ్ఞ ఎంట్రీకి రంగం సిద్ధమైందని తెలుస్తోంది. అయితే బాలయ్య కుమారుడు డెబ్యూ మూవీ ఏ డైరెక్టర్ తో చేయనున్నాడన్నది ఆసక్తికరంగా మారింది. బోయపాటి శీను పేరు ప్రముఖంగా వినిపిస్తున్నా ఇంకా ఫైనలైజ్ కాలేదు. అయితే మోక్షజ్ఞ సినిమాకు బాలయ్యే నిర్మాతగా వహరించబోతున్నారని సమాచారం. త్వరలోనే మోక్షజ్ఞ డెబ్యూ మూవీ గురించి మరింత క్లారిటీ రానుంది.




# ఆబాద్ లయన్స్‌క్లబ్‌కు అవార్డులు

- జిల్లాలో బెస్ట్ రీజియన్ చైర్మన్‌గా రాజశేఖర్ రెడ్డి, సెకండ్ బెస్ట్ అధ్యక్షుడిగా శ్రీభాష్యం రఘు



**జనగామ, మన చౌరాస్తా :** లయన్స్ అంతర్జాతీయ సేవా సంస్థ 320 ఎఫ్ జిల్లాలోని 8 రీజియన్లలో బెస్ట్ రీజియన్ చైర్మన్‌గా జనగామ ఆబాద్ క్లబ్‌కు చెందిన లయన్ కదిరె రాజశేఖర్ రెడ్డికి అవార్డు లభించింది. ఆదివారం రాత్రి వరంగల్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ పాఠశాలలో జరిగిన జిల్లా అవార్డ్స్ నైట్ సభకు జిల్లా గవర్నర్ వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథి మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ హెచ్ రాజిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి అవార్డు ప్రదానం చేశారు. 2007లో లయన్స్ సంస్థలో చేరిన రాజశేఖర్ రెడ్డి 2013-14 లో జనగామ ఆబాద్ క్లబ్ అధ్యక్షుడిగా సేవ చేశారు. అనంతరం 2022- 23లో జోన్ చైర్మన్‌గా పనిచేసే అప్పటి జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు చే ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో రీజియన్ చైర్మన్‌గా ప్రథమ స్థానంలో నిలిచారు. ఆబాద్ క్లబ్ అధ్యక్షుడు శ్రీభాష్యం రఘు జిల్లాలో గల 90 క్లబ్‌లలో సెకండ్ బెస్ట్ అవార్డు అందుకున్నారు. అన్న ప్రసాద వితరణ, మెంబెర్షిప్ గ్రోత్‌లో ప్రత్యేక అవార్డులందుకోగా ఈ క్లబ్ కు చెందిన గ్లోబల్ యాక్షన్ టీం సర్వీస్ విభాగం నాయకుడు వి. ప్రసాద్ రావు, గ్లోబల్ యాక్షన్ టీం విస్తరణ విభాగం నాయకుడు ఏ.భిక్షపతి, ఇంకా ఈ క్లబ్ కోశాధికారి ప్రవీణ్, జిల్లా చైర్మన్లు పబ్బ చంద్రశేఖర్, నాగబండి రవీందర్, అల్లాడి ప్రభాకర్ రావు, పులుగం సురేశ్ కమిటెడ్ లీడర్ అవార్డు అందుకున్నారు. అవార్డులు సాధించిన నాయకులను క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్లు డా. డి. లవకుమార్ రెడ్డి, కన్న పరశురాములు, నూతన అధ్యక్షుడు డా. పి. నాగేశ్వర రావు, ఇతర సభ్యులు అభినందించారు.



# బాధితులకు బాసటగా నిలవాలి

- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

**వరంగల్, మన చౌరాస్తా :** లైంగిక దాడులకు గురైన బాధితులకు బాసటగా నిలవాల్సిన బాధ్యత భరోసా కేంద్రంపై ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. భరోసా కేంద్రం నాలుగో వార్షికోత్సవ వేడుకల సందర్భంగా పోలీస్ కమిషనర్ రంగంపేట్‌లోని భరోసా కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ అధికారులు, సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం భరోసా కేంద్రం తీరును తెలుసుకోవడంతో పాటు భరోసా కేంద్రం పరిసరాలను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులకు సీపీ చేతుల మీదుగా ప్రభుత్వం మంజూరు చేసిన నష్ట పరిహారం చెక్కులు, కుట్టు మిషన్లుఅందజేశారు. కార్యక్రమం భరోసా కేంద్రం ఇన్‌స్పెక్టర్ సువర్ణ, షీ టీం ఇన్‌స్పెక్టర్ సుజాతతో పాటు భరోసా, షీ టీం విభాగాలకు చెందిన ఎస్‌ఐలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కన్నీరు పెట్టిన విద్యార్థులు

**చేర్యాల, మన చౌరాస్తా :** ఉపాధ్యాయులు ఇక్కడే అయితే ఎక్కడైనా బడిలో పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్తే వారికి సన్మానం చేయడం, ఆ రోజు వరకు తమ బాధను వెళ్లగక్కడం సహజంగా చూస్తుంటాం. అయితే ఉపాధ్యాయుల కోసం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకోవడం వారి మధ్య ఉన్న గొప్పతనాన్ని గుర్తుచేసింది. 'సార్ మీరు ఎక్కడికీ పోవద్దు మాతోనే ఉండాలి మాకు మిరే పాఠాలు చెప్పాలి.. మీరులేని ఈ బడికి మేము రాం..' అంటూ బదిలీపై వెళ్తున్న కొంతమంది ఉపాధ్యాయులను పట్టుకుని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరు ప్రాథమిక పాఠశాలలో సోమవారం జరిగింది. ఈ పాఠశాలలో 123 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంచార్జి హెచ్‌ఎం సందిటి సులోచన, ఉపాధ్యాయులు తాటికొండ యాదయ్య, గొంటి బుచ్చయ్య, అక్కెనపల్లి ఇంద్రసేన రెడ్డి, ఉప్పల భాస్కర్, కామిడి రత్నమాల, పనిచేస్తున్నారు. వీరిలో ఒక్క టీచర్ మెడిచెల్మి అయోధ్యకు ప్రమోషన్ రావడంతో అదే పాఠశాలలో హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టారు. మిగతా అందరూ ఎనిమిది సంవత్సరాల కాలపరిమితి దాటడంతో ఇక్కడ పనిచేస్తున్న టీచర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీపై వెళ్లాల్సి ఉంది. టీచర్లు బదిలీ అవుతున్నారనే విషయాన్ని తెలుసుకున్న పాఠశాల విద్యార్థులంతా వారి దగ్గరకు వెళ్లి దుఃఖసాగరంలో మునిగిపోయారు. పిల్లలు తనపై పెంచుకున్న ప్రేమకు టీచర్లు కన్నీళ్ల పెట్టుకున్నారు.



# బుర్ర అపర్ణకు పీహెచ్‌డీ పట్టా



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మండలం ఓబుల్‌కేశ్వాపూర్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు బుర్ర శంకరయ్య గౌడ్, లక్ష్మి దంపతుల కుమార్తె బుర్ర అపర్ణ పీహెచ్‌డీ పట్టా సాధించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆమె సమర్పించిన ఫిజిక్స్ విభాగం పరిశోధన అంశంపై పీహెచ్‌డీ అవార్డును ఉస్మానియ విశ్వ విద్యాలయం ఎగ్జామినేషన్ అదనపు కంట్రోలర్ ప్రకటించారు. అపర్ణ గురువు ఉస్మానియ విశ్వ విద్యాలయం ఫిజిక్స్ ప్రొఫెసర్ డా. కలీం అహ్మద్ జలీలి మార్గదర్శనం లో 'ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ఎన్ ఐఎంజీజీడీ అండ్ కె జడ్‌ఎన్ జీడీ నానో ఫెర్రిటీస్క' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించారు. సొంతూరులో పదో తరగతి వరకు చదివిన అపర్ణ జనగామ ఏబీవీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, ఏకశిలా డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి నిజాం కళాశాల హైదారాబాద్‌లో ఎంఎస్సీ పూర్తి చేసింది.



# జనగామ ఎమ్మెల్యే పల్లా అరెస్టు

**హైదరాబాద్, మన చైరాస్తా :** జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అరెస్ట్ అయ్యారు. గాంధీలో దీక్ష చేస్తున్న మోతీలాల్‌ను పల్లా రాజేశ్వర్ రెడ్డి కలిసేందుకు వెళ్లారు. దీంతో ఎమ్మెల్యే పల్లాను పోలీసులు అరెస్ట్ చేసి బొల్లారం పీఎస్‌కు తరలించారు. అయితే నిరుద్యోగుల డిమాండ్ల పరిష్కరించాలని మోతీలాల్ నాయక్ వారం రోజులుగా గాంధీ ఆస్పత్రిలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. గత రాత్రి ఆయనను కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కలిసి కాసేపు మాట్లాడారు. సోమవారం ఎమ్మెల్యే పల్లా ఆయనను కలిసేందుకు వెళ్లగా పోలీసులు అరెస్టు చేశారు. దీంతో గాంధీ ప్రాంతంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి తలెత్తాయి. కాగా, పల్లా అరెస్టను నిరసిస్తూ సోమవారం సాయంత్రి జనగామ బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన నిర్వహించాయి.



# మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

**జనగామ, మన చౌరాస్తా :** దేశ సమగ్రత, సమాజ పురోగాభివృద్ధికి పాటుపడిన మహనీయులను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో డాక్టర్స్ డేను పురస్కరించుకొని సోమవారం సాయంత్రం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో డాక్టర్ వృత్తికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు చేశారు. శ్రద్ధతో చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ పోతు అనిల్ బాబు అధ్యక్షత వహించగా అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మధు, సుమంత్, లక్ష్మయ్య, సోమేశ్వర చారి, నాజియా సుల్తానా, స్టాఫ్ నర్స్ పావని, డిప్యూటీ వార్డెన్ సల్మాన్ పాల్గొన్నారు.